# రాగం తీయని కోయిల

- యలమర్తి అనూరాధ



తెల్లారితే ఉగాది. పండుగ వస్తోందంటే ఎంత సందడిగా ఉండేది. ఏదీ ఇప్పుడా సవ్వడి కూడా కనిపించటం లేదు. పిల్లలకు 'ఉగాది' అంటే ఉత్సుకత కూడా లేదు. వాళ్లవన్నీ ఇంగ్లీషు చదువులు. చేసుకొనేవి, చేసుకోవాలి అనుకొనేవి కూడా వారి పండుగలే!

న్యూ ఇయర్ ప్రారంభమవుతుందని జనవరి ఫస్ట్‌కి నెల క్రితం నుంచే ఎంత హంగామా చేశారు.

'మన డాబా పెద్దదిగా ఉంటుంది కదమ్మా! పార్టీ మనింట్లోనే ఏర్పాటు చేద్దాం' అని ఫ్రెండ్స్ అందరికీ పిలుపులు. అది కూడా మామూలుగా కాదు. ఆహ్వాన పత్రికలు ముద్ర వేయించి, ఆ రాత్రి రాత్రంతా అరుపులు, కేకలు, పాటలు, డ్యాన్సులు.

సరిగ్గా పన్నెండు గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేరింతలు. కొత్త సంవత్సరానికి ఎంత చక్కటి ఆహ్వానం? నిద్ర మేల్కొని సరిగ్గా పన్నెండు గంటలకి చెప్పటం అంటే ఎంత శ్రద్ధ ఉండాలి. ఇది అందరికీ అతి మామూలు అయిపోయింది. అప్పుడే అందరికీ ఫోన్లు చెయ్యటం, ఫోన్లలోనే గ్రీటింగ్స్ రిసీవ్ చేసుకోవటం... ప్రొద్దున్నే తలంటు పోసుకుని, దెబ్బలాడి మరీ కొత్త డ్రస్సు కుట్టించుకొని, పళ్లు, పూలు, స్వీట్స్ తీసుకుని దానికి గ్రీటింగ్ కార్డ్సు జతచేసి తెలిసిన అందరికీ పంచిపెట్టి విషెస్ చెప్పి రావటం... ఇదంతా ప్రతి సంవత్సరం అలవాటయిపోతున్నా నాలో పెరిగిపోతున్న అసంతృప్తి. నాలో అణుచుకోలేని అలజడి.

ఒక కంట కన్నీరు... ఒక కంట పన్నీరులా... మనసులో ఆలోచనల కెరటాలు. ఇంత సందడికి ఆనందం. అదే స్థానంలో మన తెలుగు సంవత్సరాదికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వటం లేదేం అని బాధ. ఈ పండుగను ఇలా వేడుకగా చేసుకుంటే ఇంకా బాగుంటుంది కదా! కొన్నాళ్లకు 'ఉగాది'ని మరచిపోతామేమో అన్నంత బాధ అనుక్షణం నన్ను కృంగదీస్తోంది. పాఠశాలల్లో తెలుగు తీసేశారన్న రోజే నా మనసు మూగబోయింది. ఇంగ్లీషు నేర్చుకుంటే తప్పులేదు కానీ ఇలా తెలుగు... మన మాతృభాషను మరచిపోతే ఎలా? మన భాషలో... మన అక్షరాల్లో ఉన్న తీపి, మధురిమ కరువైపోతుంటే కలవరం. ఆ కలవరాన్ని అణుచుకోవటానికి నా పాపకి ఇంట్లోనే తెలుగు పాఠాలు చెప్పటం ప్రారంభించాను. దానికి స్కూలులోనే స్టడీ అవర్స్. ప్రొద్దున ఎనిమిది గంటలకు వెళ్లి సాయంత్రం ఆరున్నరకి గూటికి చేరుతుంది. అలసిసొలసిపోయి వచ్చే నా తల్లి ఇంటికి రాగానే 'అమ్మా! నిద్ర వస్తోంది! కాసేపు పడుకుంటానమ్మా!' అంటూ తన ఒడిలోనే నిద్రలోకి జారుకునేది. మరి ఒకటా రెండా కేజీలు లెక్కన పుస్తకాలు. వాటి బరువును తలచుకొంటే బావురుమంటుంది మనసు. చిన్నారి పసిపాపలే వీరు. లెక్కకు మించిన బరువులు వారు వీపుల మీద పడేస్తే వారి వెన్నెముకలు విరిగిపోవూ అని అనిపిస్తుంది ఎప్పుడూ!

చిన్నప్పుడు తామెంత సరదాగా గడిపేవారం. స్కూలు సంచి బరువు అనిపించేదే కాదు. అంతా చూస్తే పది పన్నెండు పుస్తకాలు ఉండేవేమో! ఆడుతూ పాడుతూ, క్యారేజీ సంచి ఊపుకుంటూ ఇల్లు చేరేవారం. అమ్మ పెట్టినవి తినేసి తూనీగల్లా గ్రౌండ్‌లోకి పరుగెట్టేవాళ్లం. ఒక గంటసేపు ఆటలు. ఒకటా, రెండా! ఆ గంటలూ ఎన్ని రకాల ఆటలు. ఆ పని పరుగులు. నవ్వులు, కేరింతలు... ఓహ్! ఎంత బాగుండేది. ఇప్పటి వాళ్లకి అదంతా లేనేలేవు. రాగానే టి.వి. ముందు కూర్చుని కార్టూన్ నెట్‌వర్క్‌లో మునిగిపోవటం. అందులోనే ప్రకృతి సౌందర్యాన్ని తిలకించటం. ఏమిటో బాల్యం అంటే తెలియకుండా గడిపేస్తున్నారని మరోప్రక్క వ్యథ.

వారి బాల్యం గురించి అసంతృప్తి వున్నా ఏం చెయ్యలేక వదిలేశాను. మరి ఆడుకోండమ్మా అన్నా, వెళ్లే ఓపికలు లేకపోతే మనమేం చెయ్యగలం? అలా అని తెలుగు భాష నా పిల్లలకు రాదు అని తలచుకొంటుంటే మాత్రం మనసు వికలమయ్యేది. అది పోగొట్టుకునేందుకు నేను ఊపిరాడని పనితో ఉక్కిరిబిక్కిరవుతున్నా, ఖాళీ లేకపోయినా చేసుకొని మరీ దానికి ఖాళీ ఉన్నప్పుడల్లా 'తెలుగు చదువుకోమ్మా!' అని పోరేదాన్ని. వాళ్లు చివరి పరీక్షలు స్కూల్లో రాసేప్పుడు నేను కూడా ఇంట్లో దీనికి తెలుగు పరీక్ష పెట్టేదాన్ని. మార్కులు వేసి తొంభై శాతం వచ్చిందని, డెబ్బై శాతం వచ్చాయని మురిసిపోయేదాన్ని. దానిలో అంతులేని ఆనందాన్ని పొందేదాన్ని. అలా మూడో తరగతిదాకా చక్కగా చదివించాను. నాలుగో తరగతిలో నత్తనడక, అయిదులో అసలు తెలుగుకే ఎగనామం పెట్టేసింది. 'అమ్మా! నా చదువు చదువుకుంటూ ఇది కూడా చదవాలంటే కష్టంగా ఉందమ్మా! కోర్సు ఎక్కువగా ఉంటోంది. అక్కడ స్టడీ అవర్స్‌లో చదువుకున్నా మిగిలినది మళ్లీ చదువుకోవటం, హోమ్ వర్కు చేసుకోవటం... నువ్వే చూస్తున్నావు కదమ్మా! నీ కోరిక



వేసవి సెలవుల్లో తప్పక తీరుస్తాను. రెండు నెలల్లో మొత్తం చదివేస్తాను. ప్లీజ్ అమ్మా!' అంటూ అది జాలిగా, బాధగా అన్న మాటలు విన్నాక ఇక పాఠాలు చెప్పాలన్న ప్రయత్నమే మానుకున్నాను. సెలవులేగా కాస్త వారికి ఆటవిడుపు. అప్పుడు కూడా నేను వాళ్లను నా దగ్గిరే బంధిస్తే ఎలా? ఆ నాలుగు రోజులన్నా సరదాగా తిరిగిరానీ అని ఎక్కడికి వెళతామంటే అక్కడికి పంపేదాన్ని. కానీ నా తృప్తి కోసం వాళ్లకో అలవాటు చేశాను. ఒక పుస్తకం ఇచ్చి రోజూ వాళ్లేం చేశారో అందులో తెలుగులో రాయమనేదాన్ని. ఏ రోజు ఏం జరిగింది, వారి అనుభూతులు రాసుకుంటే తరువాత చదువుకోవటానికి థ్రిల్‌గా ఉంటుందని చెప్పేదాన్ని. రాసే పది వాక్యాలలో పద్నాలుగు తప్పులు. అయినా రాయమంటూనే ఉన్నాను. అది కూడా ఓపిగ్గా రాస్తూనే ఉంది. ఎంతైనా అది నా బంగారు తల్లి. ఎలాగైనా అది నాతో సహకరిస్తుంది. దానిని భవిష్యత్తులో మంచి రచయిత్రిని... ఇంకా చెప్పాలంటే తెలుగు భాషపై పట్టు చిక్కించుకున్న గొప్ప నవలా రచయిత్రిగా దాన్ని తయారు చెయ్యాలని.. దానికా శక్తి ఉంది. దాని మాటలు అలా ఎవరో చెప్పినట్లే ఉంటాయి. రాయిలా వున్నప్పుడు రాగాలు పలుకుతుందని ఎవరికి తెలుస్తుంది శిల్పిక తప్ప. అలాగే నా తల్లిలో దాగున్న సృజనాత్మకత నాకు తప్ప ఎవరికి అర్థమవుతుంది. అదంతా కాదు. తెలుగు ఎక్కడ మూగబోయినా మా ఇంట్లో మూగబోకూడదు. అదే నా పట్టుదల. నా ధ్యేయం.

'సరే! భవిష్యత్తు గురించి నీ ఆలోచనలు బాగున్నాయి. రేపటి గురించి ఆలోచించు. మీ ఆయన అనే 'ఆర్భాటరావు' పండుగకు కాస్త వేపపువ్వు కొనుక్కురండి అంటే ఏమన్నాడు?'

'పోవోయ్! నాకు తీరకలేదు. పనమ్మాయ్‌తో తెప్పించుకోమనలేదూ! గుర్తుందా?' మనసు నిలదీసింది.

నిజమే! పొద్దున్నే ముందు దాన్ని బ్రతిమాలుకొని ఒక పది రెమ్మలు తెప్పించుకోవాలి. ఇదివరకు ఇళ్లలోనే వేపచెట్లు. ఇప్పుడు అవి కూడా కరువే! బజారుకి పంపి తెప్పించాలి. అదో వెయ్యిళ్ల పూజారి. అది కూడా నా ఓటు 'హ్యాపీ న్యూ ఇయర్‌కే' (హ్యాపీ అనేది న్యూ ఇయర్‌కి అందరూ కలిపేస్తున్నారు లెండి) అంటే నేనే కదలాలి.

ఆలోచనలలో పడి సరిగా నిద్రపట్టనేలేదు.

తెలతెలవారబోతోందని పక్షులు తమ కిలకిలారావాలతో పలకరిస్తుంటే ఒంటరిగా ఉగాదికి నేనే ఉషోదయం చెబుతూ శుభాకాంక్షలందించా! కొన్నాళ్లకు ఈ కిలకిలలు కూడా కరువయిపోతాయేమోనని భయం లోలోపల ఉండనే ఉంది. మరి ఎక్కడ చెట్లు కనిపించినా కొట్టేసి మరీ ఇళ్లు కట్టేసుకుని కాంక్రీట్‌మయం చేసేస్తున్నాం కదా!

గుమ్మం ముందు ముగ్గు పెడుతుంటే ద్వారం బోసిగా కనిపించింది. దాని మెడకు నెక్లెస్‌లా వేలాడాల్సిన మామిడి తోరణాలు లేవు కదా! అందుకే వెలవెలబోతోంది.

వెంటనే కొడుకు దగ్గర చేరాను.

'ఒరేయ్! నాన్నా! లేవరా! కాసిన్ని మామిడాకులు తేరా! తోరణాలు కట్టుకుందాం' అన్నాను.

ఊహుఁ! వాడు నిద్రలోనే దుప్పటిని మరింత పైకి లాక్కుంటూ- 'పోమ్మా! అవి కట్టనంతలో కొంపలంటుకుపోవు. నా బంగారంలాంటి నిద్ర చెడగొట్టకు. నీకు కావాలంటే ప్లాస్టిక్ తోరణాలు షాపు నుంచి తెచ్చిపెడతాలే!' అన్నాడు.

'ఎంత ఉదారత? మన మైండ్‌లే ఆర్టిఫిషియల్‌గా తయారవుతున్నాయి. ఇక అన్నీ ఆర్టిఫిషియల్ ఐటమ్స్ వాడితే తప్పేముంది?

ప్రక్కింటివారి అబ్బాయిని బ్రతిమాలి ఎలాగో మామిడి తోరణాలు కట్టా! అప్పటికి కానీ నా మనసు శాంతించలేదు.

పనిమనిషి నాకు కుదరదమ్మా అని ఖచ్చితంగా చెప్పటంతో నేనే బయటకు వెళ్లి వేపపూత కొనుక్కొచ్చా! షడ్రుచులతో చక్కగా పచ్చడి చేస్తే అది తినటానికి పెట్టే నా వాళ్ల ముఖాలను తలచుకుంటే నాకు పచ్చడే చెయ్యబుద్ధి కాదు. అయినా ఊరుకోనుగా!

అమ్మ పచ్చడి గుర్తు వస్తోంది. తియ్యగా గ్లాసులో పోసుకుని తాగేట్లు చేసేది.

'అమ్మా! ఒక్కసారి కాదు మళ్లీ మళ్లీ తాగాలి. నీ ఉగాది పచ్చడి అంత బాగుంటుంది' అని పచ్చడి గిన్నెపైన బుల్లి గ్లాసు పెట్టుకుని మళ్లీ సాయంత్రం కూడా తాగేది.

ఆ రోజులు ఏవి?

ఆ ఆప్యాయతలు ఏవి?

ఆ అనురాగాలు ఏవి?

మబ్బుల్లా కనిపిస్తూ కనిపిస్తూనే మాయమయిపోతున్నాయి.

పండుగ వచ్చిందంటే అసలెంత హడావిడి. బూజులు దులపటాలు, ఇల్లు కడుక్కోవటాలు, ప్రొద్దున్నే తలంట్లు, వేసుకోవటానికి కొత్త బట్టలు, పిండివంటలు... స్వీట్స్... సందడి... సందడిగా... ఇక బంధువులు వుంటే వారికి మర్యాదలు... కబుర్లు... షికార్లు...

ఇప్పుడదంతా ఏమీ లేదు.

నిశ్శబ్దత.

మునుపటిలా ఇంటింటికీ వేపచెట్లు, చెట్ల గుబుర్లలో కోయిలలు, కోయిల రాగాలు. మన పిల్లలు ఎప్పటికయినా కనగలరా? వినగలరా?

ప్రశ్నలు... వేల వేల ప్రశ్నలు...

సమాధానం లేని... రాగం తీయని కోయిలలా నేను. ✦

# గాసి మాన్పే ఉగాదికి స్వాగతం

*- డా. మన్నవ భాస్కరనాయుడు.*

స్వాగతము చైత్రలక్ష్మీ!
మాగిన మధురార్ద్ర హృదయ మాకందములన్
భోగములు నీకు... భవదీ
యాగమనము జనము మనము లానందింపన్!
ఎత్తులెక్కినాము. విజయేందిర మందిరమందు సౌఖ్యపున్
గుత్తుల మెక్కినాము. సమకూరిన కోరిన ప్రక్కదారులన్
మత్తుల చిక్కినాము. తగు మార్గము చూపి, బలమ్ము చేపి, మా
సత్తువ భావయౌవన విశాల సుశీల ఫలమ్ము చేయుమా!

తియ్య మామిడి పండ్ల నెయ్యముతోపాటు
ఆశయాలకు తీపి అందమిచ్చి
కలకంఠ కలనాదముల దీప్తితోపాటు
కలకండ మెదడుల కలిమినిచ్చి
శుక ముఖాలాప సత్సుఖములతోపాటు
మాటలందున నీతి ఊటలిచ్చి
మల్లె పూపొదల సంపద హాయితోపాటు
ఎదల పొదుల ప్రేమ తృప్తినిచ్చి
రుధిర మధుపాన మతిహీన రుజలు మాన్పి
అక్రమ పరాక్రమాఖీల విక్రమాల
వికృత సమలంకృత వికీర్ణ విషములార్పి...
మాకు మానవ శక్తినిమ్మా... ఉగాది!

ఇరువదొకటో శతాబ్దికి పరువునిల్పు
తరువు నీడలనిచ్చి- ఈ ధరణి మీద
మనిషి ప్రాణానికొక ధర అనక... విలువ
నిచ్చి... ప్రేమ చలువ చల్లవే... ఉగాది!

గతమునంతయు మరచి- స్వాగతము పరచి
ఒళ్లు కళ్లుగా- కళ్లు కాయల్లుకాగ
ఎదురుచూశాము.... యుద్ధాల బెదురులేని
గాసిలేని... భావి నొసంగుమా... సుభానూ!